





• గిరిప్రదక్షిణ

చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉదయం ఆది దంపతుల గిరిప్రదక్షిణ జరిగింది. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ నుంచి మొదలైన గంగా సమేత దుర్గామల్లేశ్వరుల గిరిప్రదక్షిణ కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం, కబేళా, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి ఘాట్‌రోడ్డు వద్దకు చేరుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

8లో



జల్ చలో..!

- రాజధాని అమరావతికి జలమార్గం • ఇబ్రహీంపట్నం-రాయపూడికి దగ్గరి దారి
- ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులకు అందుబాటులో లాంచీ సర్వీసులు
- ప్రతి గంటకూ ఓ ట్రిప్పు.. రోజంతా రాకపోకలు
- అమరావతి పనులు ఊపందుకుంటే మరిన్ని తిరిగే అవకాశం

10లో

మనదే పైచేయి

ఇంటర్ ఫలితాల్లో టాప్‌లేపిన కృష్ణా, ఎన్టీఆర్

రాష్ట్రంలో కృష్ణా ఫస్ట్.. మూడో స్థానంలో ఎన్టీఆర్

ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు తిరుగులేని విజయాన్ని నమోదు చేశాయి. ఏటా మాదిరిగానే రాష్ట్రంలోనే కృష్ణాజిల్లా మొదటి స్థానంలో నిలవగా, ఎన్టీఆర్ జిల్లా మూడోస్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తంగా అమ్మాయిలే అధిక ఉత్తీర్ణతా శాతాన్ని నమోదు చేయగా, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు 980 పైబడి మార్కులతో సత్తా చాటారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఆదివారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా, సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుంచి జరగనున్నాయి. - ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ

- సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు
- పాయకాపురం విద్యార్థినికి 984 మార్కులు
- నేటి నుంచి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు
- 15 నుంచి సప్లిమెంటరీ ఫీజుల చెల్లింపు
- మే 12 నుంచి పరీక్షల నిర్వహణ

కృష్ణాలో 93 శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం ఇంటర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. కృష్ణాజిల్లా నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 19,133 మంది విద్యార్థులు హాజరుకాగా, 17,708 మంది ఉత్తీర్ణత సాధించారు. 93 శాతం ఉత్తీర్ణతతో ఏటా మాదిరిగానే కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక మొదటి సంవత్సరం పరీక్షలకు 23,219 మంది హాజరు కాగా, 19,743 మంది ఉత్తీర్ణులయ్యారు. 85 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే కృష్ణాజిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 615 మంది పరీక్షలకు హాజరుకాగా, వారిలో 485 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతా శాతం 79గా నమోదైంది. మచిలీపట్నం లేడియాంప్తిల్ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఏ.బాలాత్రిపురసుందరి ఎంపీసీ గ్రూపులో 1000/980 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది. మొవ్వ క్షేత్రయ్య జూనియర్ కళాశాల విద్యార్థి కె.మురళీధర్ ఎంపీసీ గ్రూపులో 1000/973 మార్కులు సాధించి ద్వితీయస్థానం పొందాడు. ఉయ్యూరు మండలం ఆకునూరు జూనియర్ కళాశాల విద్యార్థిని బి.వరలక్ష్మి ఎంపీసీ గ్రూపులో 1000/954 మార్కులు, అవనిగడ్డ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.మేఘనసంధ్య ఎంపీసీ గ్రూపులో 1000/954 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. మొవ్వ క్షేత్రయ్య జూనియర్ కళాశాల ఏటా మాదిరిగానే 87 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో మొదటిస్థానంలో మిగతా 8లో..



విద్యార్థుల విజయ సంకేతం

నేటి నుంచి రీకౌంటింగ్‌కు దరఖాస్తులు

జవాబుపత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 13 నుంచి 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 15 నుంచి 22వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి. సప్లిమెంటరీ పరీక్షలను మే 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రకటించారు.

రవాణాసురులు

చేసేది రవాణా శాఖలో ఓ సాధారణ ప్రైవేట్ ఉద్యోగం. జీతం రూ.30 వేలకు మించి ఉండదు. అటువంటి ఉద్యోగుల చేతిలో ఖరీదైన ఐ ఫోన్లు.. ఆకర్షించే హుందాయ్ కార్లు.. మెరిసిపోయే బంగారు చైన్లు.. బ్రాస్‌లెట్లు.. ఇంత సాధారణ ఉద్యోగికి ఇంత లగ్జరీ లైఫ్ ఎలా సాధ్యమనే అనుమానం అందరికీ వస్తుంది. అదే అనుమానం ఉన్నతాధికారులకు కూడా రావడంతో తెరవెనుక అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతూ వస్తున్నాయి. రవాణా శాఖలోని సాఫ్ట్‌వేర్ విభాగంలోని ప్రైవేట్ ఉద్యోగుల అవినీతిపై ఎట్టకేలకు అప్రమత్తమైన ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు.

రవాణా శాఖలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అవినీతి కథలు

- చేసేది ప్రైవేట్ ఉద్యోగం.. తక్కువ జీతం
- వాడేది ఐఫోన్లు, హుందాయ్ కార్లు, లగ్జరీ లైఫ్
- సమస్త ఆన్‌లైన్ సమాచారం ఏజెంట్లకు చేరవేత
- నాడు వాహన్ ఆన్‌లైన్ సేవల్లో అక్రమాలు
- నేడు ఫ్యాన్సీ నెంబర్లు, లైసెన్స్‌ల జారీలో..
- తెరవెనుక భారీగా నగదు వసూళ్లు
- ఎట్టకేలకు గుర్తింపు.. విధుల నుంచి తొలగించాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రవాణా శాఖ సాఫ్ట్‌వేర్ విభాగంలో పనిచేస్తున్న కొందరు ప్రైవేట్ ఉద్యోగులు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న సమాచారం ఆర్టీఏ ఉన్నతాధికారులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. విజయవాడ కేంద్రంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో వెలుగు చూసిన నకిలీ ఆర్సీల కుంభకోణం దగ్గర నుంచి ఇటీవల ఫ్యాన్సీ నెంబర్ల బిడ్డింగ్, హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో భారీగా అవకతవకలు చోటు చేసుకోవటానికి కొందరు ప్రైవేట్ ఉద్యోగులే కారణమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వారిని తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నెంబర్ ప్లేట్ బిడ్డింగ్, హెవీ వెహికల్ లైసెన్స్ జారీలో అవకతవకలు

కొంతకాలంగా రవాణా శాఖలోని కొంతమంది ప్రైవేట్ ఉద్యోగులు.. బడా ఏజెంట్లతో సంబంధాలను కలిగి ఉంటున్నారు. రవాణా రహస్యాలను బయటకు తీసుకెళ్లేంత సంబంధాలు వీరిమధ్య ఏర్పడ్డాయి. నెంబర్ ప్లేట్ బిడ్డింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని బయటకు చేరవేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. సాధారణంగా ఫ్యాన్సీ నెంబర్ల కోసం కొందరు పోటీలు పడుతుంటారు. ఎట్టి పరిస్థితుల్లో తమకు నచ్చిన ఫ్యాన్సీ నెంబర్లను దక్కించుకోవటానికి బడాబాబులు చూస్తుంటారు. ఎంత ఖర్చయినా పర్వాలేదు.. ఆ నెంబర్ కావాలంటూ ఏజెంట్లకు ఆఫర్ ఇస్తారు. బేరాలు కుదుర్చుకున్నాక.. సదరు ఏజెంట్లు సాఫ్ట్‌వేర్ విభాగంలో పనిచేస్తూ తమకు టచ్‌లో ఉన్న ప్రైవేట్ ఉద్యోగుల సహాయంతో కొటేషన్ వేసిన వివరాలు తెలుసుకుంటారు. ఈ సమాచారం తెలుసుకుని తమ పార్టీతో స్వల్ప మొత్తానికి కోట్ చేయిస్తారు. మిగిలిన డబ్బు అందరూ పంచుకుంటారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలోనూ ఇలాగే ఉద్యోగుల లాగిన్లలో అడ్డగోలుగా వ్యవహరించినట్టు తెలుస్తోంది.



ఉద్యోగుల తొలగింపునకు నిర్ణయం

ఈ ఉదంతాలతో సాఫ్ట్‌వేర్ వ్యవహారాలను పర్యవేక్షించే ఉద్యోగులపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిని విధుల నుంచి తొలగించాలని రవాణా శాఖ కమిషనర్ ఆదేశించినట్టు తెలిసింది.

గతంలో ఈ-ప్రగతి, వాహన్‌లో అక్రమాలు

రవాణా శాఖలో గతంలో 'ఈ-ప్రగతి', ప్రస్తుతం 'వాహన్' సాఫ్ట్‌వేర్‌ల ఆధారంగా ఆన్‌లైన్‌లో పారదర్శక సేవలు అందుతున్నాయి. దీనివల్ల ఈ శాఖలో అవినీతి తగ్గినా.. ఏజెంట్ల వ్యవస్థ మాత్రం తగ్గలేదు. అప్పట్లో దరఖాస్తులు పట్టుకునే ఏజెంట్లు.. ఇప్పుడు కంప్యూటర్ల ముందు కూర్చుంటున్నారు. ఏజెంట్ల వ్యవస్థ నిర్మూలించకపోవడం వల్ల ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా ఉపయోగం లేకుండాపోతోంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను పర్యవేక్షించే ప్రైవేట్ సిబ్బందిలో కొందరు, అధికారులు మరికొందరు అవినీతి రుచిమరిగి అడ్డదారులు తొక్కుతున్నారు. సాఫ్ట్‌వేర్ లాగిన్ అధికారాలను, వాటిని మిగతా 8లో..

భరోసా ఇచ్చేనా?

సముద్రంలో చేపలు గుడ్లుపెట్టే సమయం కావడంతో రెండు నెలల పాటు చేపల వేటపై నిషేధం విధించడంతో మత్స్యకారులు మళ్లీ ఆవేదనలో మునిగిపోయారు. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ వరకు ఈ నిషేధం ఉండగా, ఈ సమయంలో తమ పరిస్థితి ఏమిటో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాదైనా సమయానికి మత్స్యకార భరోసా కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రేపటి నుంచి రెండు నెలలు సముద్రంలో చేపల వేట నిషేధం

- మత్స్యకార భరోసాపైనే మత్స్యకారుల ఆశలు
- గత ఏడాది అందరికీ అందని వైనం
- ఈసారైనా త్వరగా అందించాలని వినతి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 111 కిలోమీటర్లమేర సముద్రతీరం ఉంది. కృత్తివెన్ను మండలం ఒర్లగొందితిప్ప, చినగొల్లపాలెం, ఏటిపొగరు ప్రాంతాల నుంచి మోటరైజ్డ్ బోట్లు 235, సంప్రదాయ పడవలు 19 సముద్రంలో వేటకు వెళ్తాయి. నాగాయలంక, కోడూరు మండలాల్లోని నాగాయలంక, ఏటిమొగ, ఏసుపురం, జింకలపాలెం, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ, గుల్లలమోద, సొర్లగొంది, పాతఉపకాలి, పాలకాయతిప్ప గ్రామాల నుంచి 1,122 మోటరైజ్డ్ బోట్లు, 51 సంప్రదాయ పడవలు చేపల వేట సాగిస్తాయి. మచిలీపట్నం మండలం కానూరు, మంగినపూడి, పల్లెతుమ్మలపాలెం, కేపీటీ పాలెం, పోలాటితిప్ప, క్యాంప్ బెల్‌పేట, గిలకలదిండి హార్బర్ నుంచి 112 మెకనైజ్డ్ బోట్లు, 739 మోటరైజ్డ్ బోట్లు, నాలుగు సంప్రదాయ పడవలు చేపల వేటకు వెళ్తాయి. మొత్తంగా 2,282 బోట్లలో 12,809 మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేట సాగిస్తారు. మెకనైజ్డ్ మిగతా 8లో..



గిలకలదిండి హార్బర్‌లో నిలిపి ఉంచిన బోట్లు

మత్స్యకార భరోసా అందరికీ అందేనా..?

వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.10 వేలను మత్స్యకార భరోసాగా ప్రభుత్వం అందజేస్తుంది. జిల్లాలో 12,809 మంది మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవిస్తుండగా, వారిలో 12,151 మందికి గత ఏడాది భరోసా లభించింది. సామాజిక పింఛన్ వస్తోందని, బ్యాంకు ఖాతాలు, ఆధార్‌కార్డులు సక్రమంగా లేవని, ఇతరత్రా కారణాలు చూపి కొంతమందికి ఈ భరోసాను అందించలేదు. 18 మీటర్ల పొడవున్న మెకనైజ్డ్ బోటులో పనిచేసే మత్స్యకారులు 10 మందికి, మోటరైజ్డ్ బోటు మత్స్యకారులు 8 మందికి, సంప్రదాయ పడవలకు సంబంధించి ముగ్గురికి భరోసా ఇచ్చే అవకాశం ఉన్నా అలా చేయట్లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఎప్పటికి మత్స్యకార భరోసా అందిస్తారో తెలియకుండా ఉందని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.



మామిడి ఎగుమతులు ముమ్మరం

నున్న మ్యాంగో మార్కెట్ నుంచి రోజుకు 300 టన్నులపైనే ఎగుమతి

మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్‌కు తరలింపు

- గతంతో పోలిస్తే తగ్గిన వ్యాపారం
- మార్కెట్‌పై బంద్ మండీల ప్రభావం
- ఈ ఏడాది కాపు తక్కువే..
- మార్కెట్‌ను నూజివీడుకు తరలిస్తేనే పూర్వవైభవం



8లో

అమరావతి 2.0కు భారీ ఏర్పాట్లు

ప్రధాని మోదీ వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ప్రణాళిక

- నాలుగు లక్షల మంది జన సమీకరణ
- మూడు భారీ టెంట్లు ఏర్పాటు చేసే యోచన
- అమరావతి రైతుల కోసం ప్రత్యేక గ్యాలరీ
- ప్రధాన వేదికతో పాటు సాంస్కృతిక వేదిక
- తెలుగు సంప్రదాయాలు తెలిసేలా ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చే అవకాశాలు ఉండటంతో లక్ష నుంచి నాలుగు లక్షల మంది వరకు జన సమీకరణ చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా టెంట్లు, గ్యాలరీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. నాలుగు లక్షల మందికి కూర్చోవటానికి వీలుగా మూడు భారీ వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నారు. ఒకవేళ సభ సాయంత్రం పూట జరిగితే ఓపెన్‌గా గ్యాలరీలు మాత్రమే ఉంచాలని చూస్తున్నారు. ముందు వరుసలో రాజధాని రైతులకు ప్రత్యేక గ్యాలరీ సిద్ధం చేస్తారు. అధికారులు, ఎంవీఐపీలు, వీవీఐపీలు, ప్రముఖులు, ప్రత్యేక ఆహ్వానితులకు వేర్వేరుగా గ్యాలరీలు ఉంటాయి. వీరందరితో పాటు వీఐపీలకు కూడా ప్రత్యేకంగా పాసులు జారీ చేయనున్నారు. ప్రధాన వేదికను భారీ ఎల్‌ఈడీలతో తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. సాంస్కృతిక వేదికను కూడా ఏర్పాటు చేయనున్నారు. తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా కూచిపూడి, ఇతర సంప్రదాయ నృత్యాలను ఈ వేదికపై ప్రదర్శించాలని ప్రణాళికలు రచిస్తున్నారు.

- అమరావతి చరిత్ర గురించి ప్రధాని నరేంద్రమోదీకి చాటిచెప్పేలా ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో అమరావతి బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, ఇతర శిల్పాలు వంటివి ప్రదర్శించనున్నారు.
- రాజధానిలో నిర్మించే ఐకానిక్ భవనాలకు సంబంధించిన త్రీడీ ప్రింట్స్‌ను ప్రదర్శించాలని నిర్ణయించారు. 40 అంతస్థులతో కూడుకున్న సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలతో పాటు మిగతా 8లో..

మోడరన్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



లేఖ్యసుకీర్తి, లీలాగోవర్ధన, చందనా దుర్గా, నాగలక్ష్మి, జ్ఞానలక్ష్మి, ఫణి తేజ

మొగల్రాజపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపించారని మొగల్రాజపురం మోడరన్ అకాడమీ డైరెక్టర్ సుంకర నాగ పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో చలువాది లేఖ్య సుకీర్తి 491, టి.లీలాగోవర్ధన 490, పి.చందనా దుర్గా 489, టి.నాగలక్ష్మి యశస్వినీ 489, కె.జ్ఞానలక్ష్మీనికిత, పి.ఫణి తేజ 486 మార్కులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్‌లో మొత్తం 97 శాతం, సీనియర్ ఇంటర్ ఎంఈసీ విభాగంలో 98 శాతం, సీనియర్ సీఈసీలో 94.5 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్లో ఎక్కువ మంది 450 మార్కులపైనే పొందారని, కామర్స్, ఎకనామిక్స్‌లో 99 మార్కులు అధిక శాతం మందికి వచ్చాయని పేర్కొన్నారు. 38 ఏళ్లుగా సుంకర పాపారావు ఆధ్వర్యంలో కామర్స్ విద్యారంగంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు.

శారద విద్యార్థుల జయకేతనం

మొగల్రాజపురం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సీనియర్, జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని శారద విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఐ.ప్రజ్ఞ 466, వి.శృతి, పి.వి.ఎస్.ఎస్.వర్షిణి, ఎం.దేవహర్షిణి, జె.శ్వేత, సిహెచ్.శ్రీనిధి 465, జూనియర్ బైపీసీలో 440 మార్కులకు ఐ.నమ్రత 436, ఎం. కృష్ణకాంత్ 434, కె.గాయత్రీ, షేక్ ఆఫియా సఫీన్ 433, సీనియర్ విభాగంలో 1000 మార్కులకు కె.యక్షిత 989, వి.స్వీకృతాంజలి, బి.శ్రావణి 987, ఈ.యశస్విని, జి.అమల్ జాసన్, టి.శేషసాయిగణేష్, దీనదయాళ్ రేవంత్ 984, జి.నాగదీపిక, కె.వర్షిక 983 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలో అంబేడ్కర్ జయంతి

- నేడు ఆయన విగ్రహాల శుద్ధి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



ప్రసంగిస్తున్న డీకే అరుణ, వేదికపై రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

విజయవాడ, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను గ్రామగ్రామాన నిర్వహిస్తామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఈ ఉత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహాలను శుద్ధి చేసి దీపాలు వెలిగిస్తామని చెప్పారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేస్తారని అసత్యాలు ప్రచారం చేశారని విమర్శించారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని దుమ్మెత్తిపోశారు. అంబేడ్కర్‌ను ఓడించడానికి జవహర్‌లాల్ నెహ్రూ అనేక కుట్రలు చేశారని ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా, ఓట్ల రాజకీయం కోసం రాజ్యాంగానికి సవరణలు చేశారని మండిపడ్డారు. మోదీ ప్రధాని అయిన నాటి నుంచి అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. దేశ, ప్రజాహితం కోసమే మోదీ రాజ్యాంగానికి సవరణలు చేశారన్నారు. దీనిపై కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేసిందని విమర్శించారు. అందుకే ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. దేశం, అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా మోదీ పాలన చేస్తున్నారని చెప్పారు. సమాజంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా కేంద్రం ఆలోచిస్తుందన్నారు.

రాజ్యాంగ విలువలకు విఘాతం

» మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మచిలీపట్నం టౌన్ , ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు విమర్శించారు. శనివారం రాత్రి ఈశ్వర రెసిడెన్సీలో 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడారు. జమిలి ఎన్నికలు, డిలిమిటేషన్, జీఎస్టీ, వక్ఫ్ సవరణ బిల్లు, పౌరసత్వ అంశాలపై కేంద్రం వైఖరి రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. 1973లో కేరళ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూపం మార్చే హక్కు ఎవరికీ లేదని తీర్పు ఇచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్‌ను స్వతంత్రంగా పనిచేసుకోనివ్వడం లేదన్నారు. వ్యవస్థల్లో ఆర్ఎస్ఎస్ ప్రమేయం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొడాలి శర్మ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు చీకటి రాజేష్, యూటీఎఫ్ నాయకుడు వెంకటేశ్వరరావు, నాయకులు చంద్రపాల్, రమాదేవి, పామర్తి నాగయ్య, కె.సుజాత, జి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి 2.0కు భారీ ఏర్పాట్లు

(7వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఐఏఎస్, ఎన్‌జీవో, గవర్నమెంట్ టైప్-1, 2, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఇతర బంగ్లాలు త్రీడీ ప్రింట్స్ ద్వారా చూపించనున్నారు.

- ఆహుతులకు రుచికరమైన తెలుగు వంటకాలను అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్యాలరీల్లో కూర్చున్న చోటకే ప్యాకింగ్‌ల ద్వారా అందించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సంప్రదాయ శాకాహార వంటలు, పిండివంటలకే పెద్దపీట వేస్తారు.
- అతిథుల కోసం నాలుగు హెలీప్యాడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో రెండు మాత్రం మోదీ, భద్రతా సిబ్బందికి కేటాయించనున్నారు. మిగిలిన రెండింటినీ కేంద్ర మంత్రుల కోసం వినియోగించనున్నారు.
- శంకుస్థాపన ప్రాంతానికి కళ తీసుకొచ్చేందుకు వీలుగా సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున ఎయిర్ బెలూన్స్ ఎగుర వేయాలని నిర్ణయించారు.
- శంకుస్థాపనకు తరలివచ్చే ప్రజల కోసం పెద్ద ఎత్తున ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను సిద్ధం చేయాలని సీఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే అవకాశం ఉన్నందున 1,500కు పైగా ఆర్టీసీ బస్సులు, మరో 700 ప్రైవేట్ బస్సులు సిద్ధం చేయాలని చూస్తున్నారు. కాగా, కేంద్రం నుంచి వచ్చే షెడ్యూల్ కోసం సీఆర్‌డీఏ అధికారులు ఎదురుచూస్తున్నారు. ఈనెల 24-26 తేదీల మధ్య అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసే అవకాశముంది.

భరోసా ఇచ్చేనా?

(7వ పేజీ తరువాయి)

బోటు చేపల వేటకు వెళ్లాలంటే కనీసం 2 వేల లీటర్ల డీజిల్‌ను నింపుకోవాలి. వారం పాటు సముద్రంలోనే ఉండి.. వేట కొనసాగిస్తారు. ఈ సమయంలో మత్స్యకారుల జీతాలు, డీజిల్ ఖర్చులు అధికంగానే ఉంటాయి. వాతావరణ అనుకూలించక, ఇతరత్రా కారణాలతో సముద్ర మత్స్యసంపద లభించకుంటే ఒక్కో విడతకు ఒక్కో బోటుకు కనీసం రూ.లక్ష నష్టం వాటిల్లుతుంది. రోజూ తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లి, మధ్యాహ్నం నుంచి తిరిగివచ్చే మోటరైజ్డ్ బోట్లకు సైతం ఖర్చు అధికంగా ఉంటుంది. చేపలు, రొయ్యలు లభ్యమైతే లాభదాయకంగానే ఉంటుందని, మత్స్య సంపద లభించకుంటే కనీస ఖర్చులు కూడా రావని మత్స్యకారులు చెబుతున్నారు. జిల్లాలో ఏటా 10,06,189 టన్నుల మత్స్యసంపద ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. ఇందులో సముద్రం నుంచి తరలే మత్స్యసంపదే అధికం. వేట కొనసాగించే బోట్లకు లీటరుకు రూ.9 డీజిల్ సబ్సిడీ ఇస్తున్నా మిగులుబాటు ఉండటం లేదని బోటు యజమానులు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి ఎగుమతులు ముమ్మరం



నున్న మ్యాంగో మార్కెట్‌లో మామిడి ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

- నున్న మ్యాంగో మార్కెట్ నుంచి రోజుకు 300 టన్నులపైనే ఎగుమతి
- మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్‌కు తరలింపు
- గతంతో పోలిస్తే తగ్గిన వ్యాపారం
- మార్కెట్‌పై బంద్ మండీల ప్రభావం
- ఈ ఏడాది కాపు తక్కువే..
- మార్కెట్‌ను నూజివీడుకు తరలిస్తేనే పూర్వవైభవం!

విజయవాడ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నున్న మ్యాంగో మార్కెట్‌లో మామిడి ఎగుమతులు ఊపందుకున్నాయి. మార్కెట్‌లో 80 శాతం దుకాణాలు వ్యాపార లావాదేవీలు కొన సాగిస్తున్నాయి. రోజుకు సుమారు 300 టన్నుల వరకు మామిడిని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే మార్కెట్‌లో ప్రస్తుతం జరుగుతున్న లావాదేవీలు తక్కువే. పలు జిల్లాల్లో ఎక్కడికక్కడ బంద్ మండీలు(లోకల్ మండీలు) ఏర్పాటు చేయడంతో ఆ ప్రభావం నున్న మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. దీనికి తోడు ఈ ఏడాది వివిధ కారణాలతో కాపు కూడా తక్కువే ఉంది. ఈ నేపథ్యంలో నున్న మ్యాంగో మార్కెట్‌ను నూజివీడుకు తరలించేందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

రోజుకు 300 టన్నుల ఎగుమతులు

నున్న మ్యాంగో మార్కెట్‌లో 40 వరకు దుకాణాలు ఉండగా 30కిపైగా దుకాణాలు తెరుచుకున్నాయి. ఒక్కో దుకాణం 10 నుంచి 15 టన్నులు వరకు మామిడి ఎగుమతులు చేస్తోంది. మొత్తం మీద 300 టన్నులకు పైగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. బంగినపల్లి టన్ను మొదటి క్వాలిటీ రూ.50 వేల నుంచి రూ. 55 వేల వరకు అమ్ముడవుతుండగా, రెండవ రకం రూ.30 వేల నుంచి రూ. 35 వేల వరకు ధర పలుకుతుంది.

ఆరు రాష్ట్రాలకు ఎగుమతులు

ప్రస్తుతం మార్కెట్‌లో సమీప జిల్లాల నుంచి చెరుకురసం, బంగినపల్లి, తోతాపురి అందుబాటులో ఉన్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాలకు వ్యాపారులు మామిడిని ఎగుమతులు చేస్తున్నారు.

బంద్ మండీల ప్రభావం

నున్న మ్యాంగో మార్కెట్‌కు విస్సన్నపేట, నూజివీడు, సత్తుపల్లి, రెడ్డిగూడెం, చీమలపాడు, తదితర ప్రాంతాల నుంచి మామిడి దిగుమతులు అవుతుంటాయి. అయితే ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు బంద్ మండీలు ఏర్పాటు చేయడంతో చాలా వరకు రైతులు రవాణా ఖర్చులు మిగులుతాయనే ఉద్దేశ్యంతో ఎక్కడికక్కడ అమ్మకాలు జరుపుతుండటంతో నున్న మ్యాంగో మార్కెట్‌లో దిగుమతి తగ్గింది.

ఈ ఏడాది కాపు తక్కువే..

గతంతో పోలిస్తే ఈ ఏడాది కాపు తక్కువగా ఉండటం కూడా మార్కెట్‌లో ప్రభావం చూపుతోంది. మామిడి కాపు మొదట్లో పూత గతంతో కన్నా ఎక్కువ వచ్చినా కోడిపేను తెగులు కారణంగా పూత 95 శాతం రాలిపోయినట్లు రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు ఇటీవల వచ్చిన గాలివాన బీభత్సం కూడా పూత, కాయలు రాలి మరింత నష్టాన్ని మిగిల్చాయి.



లారీలోకి మామిడిని లోడ్ చేస్తున్న కార్మికులు

నూజివీడు తరలింపునకు ప్రయత్నాలు

మామిడి దిగుమతులు అయ్యే తోటలకు నున్న మ్యాంగో మార్కెట్ దూరంగా ఉండటంతో మార్కెట్‌ను నూజివీడుకు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడి కన్నా నూజివీడులో దుకాణాలు తెరిస్తే అధిక సంఖ్యలో రైతులు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయని తద్వారా వ్యాపారాలు పెరుగుతాయని రైతులకు కూడా ఉపయోగంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

మంత్రి లోకేశ్ దృష్టికి మార్కెట్ తరలింపు విషయం



నున్న మ్యాంగో మార్కెట్‌లో వ్యాపారాలు దాదాపు తగ్గుముఖం పట్టాయి. రైతులు ఇక్కడికి రావడం దూరాభారంగా భావిస్తున్నారు. ఈ విషయమై గతంలో మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి రైతులతో సమావేశమయ్యారు. రైతులు కూడా మార్కెట్ కావాలని కోరడంతో అక్కడికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– శ్రీనివాసరెడ్డి, మ్యాంగో గ్రోయర్స్ అసోషియేషన్ కార్యదర్శి

సింహ వాహనంపై ఆది దంపతులు

» ఘనంగా చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు

» భారీగా తరలివచ్చిన భక్తులు



సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా 5వ రోజైన శనివారం సింహ వాహనంపై గంగా, పార్వతీ (దుర్గా) సమేత మల్లేశ్వరులు వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా వేద పండితులు, అర్చకులు ఉదయం మూల మంత్ర హవనములు నిర్వహించారు. 10 గంటలకు సదస్యం జరిపారు. వేద పండితులు వేదస్వస్తి, వేద ఆశీర్వచనం పలికారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఔపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం మహామండపం నుంచి సింహవాహనంపై గంగా పార్వతీ సమేత మల్లేశ్వరుల ఊరేగింపు ప్రారంభమైంది. ప్రఖ్యాతిగాంచిన సింహ వాహనంపై ఆది దంపతులు కొలువై ఉండగా, సంప్రదాయ కళలైన తప్పెట్లు, మహిళా కోలాట నృత్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శన, తాళం భజన కళాకారుల ప్రదర్శనలు ముందు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సింహవాహన సేవ శ్రేణి కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్ బజార్ మీదుగా తిరిగి కొండపైకి చేరుకుంది.భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు దుర్గా ప్రసాద్, సహాయ కార్యనిర్వహణాధికారి దుర్గారావు, పర్యవేక్షకులు నరసింహరాజు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ గిరి ప్రదక్షణ

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరుల ఉత్సవ మూర్తుల గిరిప్రదక్షణ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అన్నపు రాశిని పోసి బలిహరణలు సమర్పించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ గుమ్మడికాయ దిష్టితీశారు. కొబ్బరికాయలు కొట్టి బలిహరణలు సమర్పించారు. అనంతరం స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రి, అధికారులు ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాల నడుమ అమ్మవారి గిరిప్రదక్షణ కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా తిరిగి కొండపైకి చేరింది. వందలాది భక్తులు గిరిప్రదక్షణలో పాల్గొన్నారు.

మనదే పైచేయి

(7వ పేజీ తరువాయి)

నిలిచింది. అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల 83.50 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ, మచిలీపట్నం లేడియాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 79 శాతం ఉత్తీర్ణతతో తృతీయ స్థానం సాధించాయని ఆర్ఐవో పీబీ సాల్మన్‌రాజు తెలిపారు.

ఎన్టీఆర్‌లో 89 శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం 89 శాతం, మొదటి సంవత్సరం 81 శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా రెండోస్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 35,484 మంది హాజరు కాగా, 31,736 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 39,200 మంది హాజరుకాగా, 31,676 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలే అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 86 శాతం మంది అమ్మాయిలు ఉత్తీర్ణులు కాగా, అబ్బాయిలు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో అమ్మాయిలు 75 శాతం, అబ్బాయిలు 66 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలో మొత్తం పది ప్రభుత్వ కళాశాలలు ఉండగా, ద్వితీయ సంవత్సరం 606 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 398 మంది ఉత్తీర్ణత సాధించగా, 66 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వృత్తి విద్యాకోర్సులకు సంబంధించి 189 మంది పరీక్షలు రాయగా, 177 మంది ఉత్తీర్ణులై 94 శాతం ఉత్తీర్ణతను సాధించారు. మొదటి సంవత్సరంలో 997 మంది పరీక్షలకు హాజరు కాగా, 485 మంది ఉత్తీర్ణులయ్యారు. 49 ఉత్తీర్ణతా శాతం నమోదైంది. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి మొత్తం 241 మంది పరీక్షలు రాయగా, 206 మంది ఉత్తీర్ణులయ్యారు. 85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.రాజ్యలక్ష్మి (984), ఎం.రాజేశ్ (940), సీహెచ్ నవీశ్రీ (923), సీహెచ్ సాయికుమార్ (918) మార్కులు సాధించారు. బైపీసీలో షేక్ రేష్మా (984), జె.అంజలి (953), వి.భువనేశ్వరి (911), బి.మేఘన (904) మార్కులు సాధించారు. సీఈసీలో జె.ప్రకాష్ (878), డి.సాయి లిఖిత (823), సీహెచ్ వైష్ణవి (812) సాధించగా, హెచ్ఈసీలో షేక్ అయిషా పర్వీన్ (812) మార్కులు పొందింది.

స్ట్రెచర్‌పై వచ్చి పరీక్షలు రాసిన విద్యార్థి పాస్

జగ్గయ్యపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి గురై ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతి తీసుకుని స్ట్రెచర్‌పై వచ్చి పరీక్ష రాసిన పట్టణానికి చెందిన సాయిరాజు శనివారం విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. పట్టణంలోని ఓ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాయిరాజు గత ఫిబ్రవరిలో ఇంటికి నడిచి వెళ్తుండగా బైక్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. అతని కుడి మోకాలితో పాటు వెన్నుకు దెబ్బ తగిలింది. ఆపరేషన్ అనంతరం డిశ్చార్జి చేసిన వైద్యులు పూర్తి విశ్రాంతి అవసరమని చెప్పటంతో పరీక్షలు రాయటం సాధ్యం కాదని అంతా అనుకున్నారు. కుటుంబసభ్యులు వద్దని వారించారు. కానీ సాయిరాజు ఇంటర్ బోర్డు అనుమతితో పరీక్షలు రాసి 308 మార్కులు సాధించాడు.

పత్తి రైతులపై రూ.70 లక్షల భారం

» పెరిగిన బీటీ-2 పత్తి విత్తనాల ధర

» 475 గ్రాముల సంచిపై రూ.37 వడ్డన



కంచికచర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు అధికంగా సాగు చేయనున్న బీటీ-2 పత్తి విత్తనాల ధర పెరిగింది. ఖరీఫ్ సీజన్‌లో సంచికి రూ.37ల వంతున ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది రూ. 864 ఉన్న 475 గ్రాముల విత్తనాల సంచి ధర ప్రస్తుతం రూ. 901లకు చేరింది. జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో రైతులు పత్తి పంట సాగు చేస్తారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపుగా లక్ష ఎకరాల్లో పత్తి సాగువుతుంది. 2019లో రూ.710 ఉన్న విత్తనాల సంచి ధర గత ఏడాది రూ. 864 చేరింది. ఈ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం సంచికి రూ.37 వంతున ధర పెంచడంతో రూ.901 చేరింది. వ్యవసాయాధికారుల గణాంకాల ప్రకారం ఎకరానికి ఒక సంచి విత్తనాలు సరిపోతాయి. రైతుల లెక్కల ప్రకారం ఎకరానికి రెండు సంచుల విత్తనాలు అవసరం. మొత్తంగా జిల్లాకు పత్తి విత్తనాలు రెండు లక్షల సంచులు కావల్సి ఉంటుంది. ధర పెరగటం వల్ల జిల్లాలో రైతులపై రూ.70 లక్షల వరకు భారం పడనుంది. మే రెండో వారం నుంచి విత్తనాలు వస్తాయని స్థానిక డీలరు గోగినేని రామారావు చెప్పారు.

రవాణాసురులు

(7వ పేజీ తరువాయి)

చూసే అవకాశాలు కలిగి ఉండటాన్ని క్యాష్ చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ కేంద్రంగా భారీ కుంభకోణం జరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లో పాత లారీలను కొన్నట్టు, అక్కడి రాష్ట్రాల నుంచి ఎన్‌వోసీ పత్రాలను పొందినట్టు చూపించి అసలు వాహనాలే లేకుండా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించారు. లేని వాహనాలకు ఆర్సీలు సృష్టించటానికి అవసరమయ్యే డేటా ఎంట్రీ విజయవాడలోనే చేశారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో లేని వాహనాలకు ఫిజికల్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేశారు. అసలు లేని వాహనాల వివరాలు వాహన్ పోర్టల్‌లోకి ఎక్కించారు. నకిలీ చాసిస్ నెంబర్లు కొట్టి.. లేని వాహనాలు ఉన్నట్టుగా ఆన్‌లైన్‌లో చూపించారు. వీటి ఆధారంగా నకిలీ ఆర్సీలు బయటకు వచ్చాయి. అప్పట్లో ఈ సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించే వారి పాత్రపై అనుమానాలు కలగలేదు. కానీ, ఆ తర్వాత కూడా అధికారుల లాగిన్లను అడ్డం పెట్టుకుని వాహనాల అక్రమ రిజిస్ట్రేషన్లు చేయటం, లైసెన్సులు జారీ చేయటాన్ని గుర్తించి, అందుకు కారకులైన వారిపై వేటు వేశారు. అయినా ఈ అక్రమాలు ఆగలేదు.

'మీ జీతాలెంత? మీ దర్జాలేంటి? : ఉన్నతాధికారి మండిపాటు

సాఫ్ట్‌వేర్ వ్యవహారాలను పర్యవేక్షించే ఉద్యోగులంతా ఇటీవల రవాణా శాఖ ఉన్నతాధికారిని కలవగా, ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'మీ జీతాలెంత? మీ దర్జాలేంటి? విధుల్లో జాయిన్ అయినపుడు మీరెలా ఉన్నారు? ఇప్పుడెలా ఉన్నారు?' అంటూ మండిపడినట్టు సమాచారం. 'మేమిచ్చే జీతాలకు మీరు ఇంత ఆధునిక జీవితాన్ని గడపగలరా..' అని ఆయన సీరియస్ కావడంతో చేసేదేమీ లేక సదరు ఉద్యోగులంతా మౌనంగా వచ్చేసినట్టు సమాచారం.

టీటీడీ ప్రతిష్ట దెబ్బతీసేందుకు

జగన్ డైరెక్షన్‌లో భూమన యాక్షన్

» టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది హిందువులు విశ్వసించే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీసేందుకు మాజీ సీఎం జగన్‌రెడ్డి డైరెక్షన్‌లో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో వేంకటేశ్వరస్వామిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన భూమనను టీటీడీ ఛైర్మన్‌గా నియమించిన జగన్ రెడ్డి ఏ రోజైనా దేవస్థానం సాంప్రదాయాలు పాటించాడా అని ప్రశ్నించారు. గోశాలలో 100 ఆవులు చనిపోయినట్టు భూమన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 260 మంది సిబ్బంది గోవులను సంరక్షిస్తున్నారని, వయస్సు పెరగటం, వ్యాధుల వల్ల చనిపోయిన గోవులు 40 వరకు ఉంటే వంద అని ఎక్కడో ఆవుల ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని ఆరో పించారు. జగన్‌రెడ్డి హయాంలో జరిగిన తిరుమల కొండలపై అన్యమత ప్రచారం, ఏడుకొండలను తగ్గించే ప్రయత్నం ప్రజలు మర్చిపోరని వివరించారు.

కరుణాకర్‌రెడ్డివి నీచ రాజకీయాలు

» గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



వన్‌టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఆవులు మరణించాయని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు. శనివారం ఆయన నగరంలోని తన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన కరుణాకర్‌రెడ్డి ఆవులు చనిపోవటంపై రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. ఏరోజైనా కరుణాకర్ రెడ్డి గోశాలను సందర్శించారా.. కనీసం గోవులనైనా పెంచారా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులకు ఆవుల గురించి ఏమి తెలుసని నిలదీశారు. గుళ్లో దేవుళ్లను, గోవులను రాజకీయంగా వాడుకుంటున్నారన్నారు. వైసీపీ నాయకులకు నిజంగా ప్రేమ ఉంటే లారీల్లో తరలించే ఆవులను కాపాడాలని హితవు పలికారు. తనకు ఆవుల గురించి, ఆవుల పెంపకం గురించి బాగా తెలుసని, ముఖ్యంగా తాను ఒంగోలు జాతి ఆవులను పెంచుతున్నట్లు చెప్పారు. ఒంగోలు జాతి ఆవుల వలన కోట్లాది రూపాయల ఆదాయం వస్తుందని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర సంపద ఒంగోలు జాతి ఆవులని తెలిపారు. కొందరు రైతులు ఆవులను మేపలేకపోవటం వలన గోశాలకు తరలిస్తున్నారని చెప్పారు.

టీటీడీకి పట్టిన అరిష్టం భూమన

» ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): తిరుమల తిరు పతి దేవస్థానానికి పట్టిన అరిష్టం భూమన కరుణా కరరెడ్డి అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వర రావు విమర్శించారు. అజిత్‌సింగ్ నగర్ లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన ఎస్వీ గోశాలలో వందకుపైగా గోవులు మృతి చెందాయని అసత్య ఆరోపణలు చేయడాన్ని తప్పుపట్టారు. గోశాలకు వెళ్లి రికార్డులు పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. అనారోగ్యంతో కొన్ని గోవులు మృతి చెందిన మాట వాస్తవం అని, గోశాలలో ఇటువంటివి సర్వసాధారణమన్నారు. అలాంటిది గోశాలలో వందకు పైగా గోవులు మృతి చెందాయని అసత్య ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. నేను నాస్తికుడినని స్వయంగా భూమన ప్రకటించిన విషయం వాస్తవమని, ఆ సమయంలో సాక్షాత్తు వేంకటేశ్వర స్వామిపైనే అనేక విమర్శలు చేశారని గుర్తు చేశారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కరుణాకరరెడ్డి కుట్రలు చేస్తున్నారన్నారు.

టీచర్ల సీనియారిటీపై అభ్యంతరాలకు 16 తుది గడువు

» జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు

విజయవాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులు ఈ నెల 16వ తేదీ లోగా తెలియజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు తెలిపారు. ఈ సీనియారిటీ జాబితాలను ఇప్పటికే ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ(టీఐఎస్)లోను, డీఈవోల వెబ్‌సైట్లో పొందుపరచడంతోపాటు నోటీసు బోర్డులపై అతికించామని వివరించారు. అభ్యంతరాలను వ్యక్తం చేసే ఉపాధ్యాయులు పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాలో ఎక్కడ తప్పిదం ఉందో స్పష్టం తెలియజేయాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను దరఖాస్తులో పొందుపరచాలని తెలిపారు. ఈ అభ్యంతరాల దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈనెల 16 లోపు అందజేయాలని డీఈవో విజ్ఞప్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

సభ్యత్వ కార్డులే టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ కార్డులే టీడీపీ కార్యకర్తలకు అసలైన గుర్తింపు అని, పేదలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు కార్యకర్తలే అధినాయకులుగా వారి సంక్షేమం కోసం టీడీపీ కృషి చేస్తుందని పార్టీ కానుమోలు అధ్యక్షుడు చెడుగొండి శివశంకర్ అన్నారు. కానుమోలులో శనివారం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందజేశారు. మాజీ సర్పంచ్ దన్నే దుర్గారావు, చెన్నుబోయిన వెంకటేశ్వరరావు, కె. ఆగస్టీన్, మడుగుల శ్రీనివాసరావు, దన్నే గాంధీ పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేస్తున్న పార్టీ కానుమోలు నాయకులు

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : దళారులను నమ్మి మోసపోవద్దంటూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రైతులను కోరారు. మండలంలోని పునాదిపాడు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, దాళ్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించే అవకాశం లేకపోయినప్పటికీ నియోజకవర్గ పరిధిలోని రైతుల కోరిక మేరకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించటం జరిగిందని తెలియజేశారు. రైతులకు అవసరమైన మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ధాన్యం ఆరబెట్టి విక్రయించాలంటే సాధ్యం కాదని, ఆర బెట్టిన ధాన్యం ముక్కలు అయిపోతుందని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కోత కోసిన ధాన్యాన్ని కళ్లాలల్లోనే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. సమస్యను కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దళారులను నమ్మిమోసపొద్దు అంటూ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పద్మావతి, తహసీల్దార్ భవన్నారాయణ, ఆర్ఐ ఉస్మాన్, టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, టీడీపీ మండల అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, తెలుగురైతు కార్యదర్శి మద్దాలి సాయిబాబు, జనసేన పార్టీ జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు, పెనమలూరు తాడిగడప అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, గ్రామస్థులు అనుమోలు శ్రీను, మునిబోయిన వెంకటేశ్వరరావు, కాసరనేని కరుణ, మోహన్‌కృష్ణ, కర్రా కిషోర్ రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ధన్నయ్య తదితరులు



ట్రాఫిక్ నిబంధనలపై ర్యాలీ నిర్వహిస్తున్న కేసీపీ సిద్దార్థ విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల ర్యాలీ

పెనమలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కానూరు సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా కానూరు కేసీపీ సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తెలియజేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. షుమారు మూడు వందల మంది విద్యార్థులతో నిర్వహించిన ఈ భద్రతా ర్యాలీ కామయ్యతోపు సెంటరు నుంచి తాడిగడప సెంటర్ వరకు సాగింది. తాడిగడప సెంటర్లో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి విద్యార్థులు గులాబి పూలు ఇచ్చి హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వీరపనేని శశికళ, ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాడిరైతుకు బోనస్ అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

పాడిరైతుల అభ్యున్నతికి కృషి

● కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : పాడిరైతు ఆర్థిక అభ్యున్నతికి కృష్ణామిల్క్ యూనియన్ చేయూత నందిస్తూ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకులపాడు పాల సొసైటీ లోని పాడిరైతులకు శనివారం ఆయన బోనస్ పంపిణీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మూడవ విడత బోనస్ రూ. 1,52,940లను 64మంది పాడిరైతులకు పంపిణీ చేశారు. వేసవిలో పశువులకు పచ్చిగడ్డి అందుబాటులో ఉండేలా మేలైన విత్తనాలను, మేలుజాతి పశువులను పెంపొందించేందుకు అవసరమైన సెమన్‌ను సబ్సిడీపై అందిస్తూ పాడిపరిశ్రమ అభివృద్ధికి యూనియన్ కృషి చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



డాక్టర్ రవిచంద్రబాబును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పెనమలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కానూరు సిద్ధార్థ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అకాడమీ గోల్డెన్ జూబిల్లీ ఉత్సవాల్లో భాగంగా వీఆర్ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (డీమ్డ్ టుబీ యూనివర్సిటీ)లో ఇంగ్లీష్ డిపార్టుమెంట్, లిటరరీ క్లబ్ సంయుక్తంగా ఇతిహాసాలలోని మానవీయ విలువలు అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మోహన్‌బాబు యూనివర్సిటీ డీన్ డాక్టర్ శాఖమూరి రవిచంద్రబాబు మాట్లాడుతూ, మహాభారతం, రామాయణం వంటి భారతీయ ఇతిహాసాలలో నిగూఢంగా ఉన్న నీతి పాఠాలను ప్రస్తావించారు. తల్లిదండ్రులు, గురువులు, నైతిక విలువల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వీసీ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రోవీసీ ప్రొఫెసర్ ఏవీ రత్న ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన సెంటర్‌లో చలువ పందిరి ప్రారంభం

ఉయ్యూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగరపంచాయతీ ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలువ పందిరి, చలివేంద్రాన్ని చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. కౌన్సిలర్లు, వెంకటలక్ష్మి, పలియాల శ్రీనివాసరావు, కమిషనర్ పి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు గుర్నాధరావు, చిరంజీవి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ

వృత్తి విద్య కోర్సులతో మెరుగైన భవిష్యత్తు

ఉయ్యూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వృత్తివిద్యా కోర్సులు నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి శ్రీనివాసరావు అన్నారు. 2024-2025 సంవత్సరంలో ఐటీ/ఐట్స్ 10వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శనివారం ఇంటర్న్‌షిప్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వెడ్డింగ్ కార్డు, బర్త్‌డే కార్డులు ఎడిటింగ్, ఫ్లెక్సీ ప్రింటింగ్, డిజైనింగ్‌లో శిక్షణ నిచ్చారు. ఐటీ ట్రేడ్ అధ్యాపకురాలు ఆర్ సురేఖ పర్యవేక్షించారు.

వీఎన్‌పురం కాలనీలో పారిశుధ్య పనులు ముమ్మరం

గన్నవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీలో డ్రైనేజీ క్లీనింగ్ పనులు జరుగుతున్నాయి. శనివారం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షణలో జేసీబీతో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభోత్సవం చేయనున్నారని తెలిపారు. కాలనీలోని అంతర్గత రహదారుల ఇరువైపులా డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత నిస్తున్నామని తెలిపారు. సేకరించిన చెత్తను ఏరోజుకు ఆరోజు జిందాల్‌కు తరలిస్తున్నామని చెప్పారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు ప్రసాద్ పేర్కొన్నారు.



వీఎన్‌పురం కాలనీలో డ్రెయినేజీని జేసీబీతో క్లీన్ చేయిస్తున్న కార్యదర్శి ప్రసాద్

ముగిసిన పేరంటాలమ్మ తిరునాళ్ల

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు

విజయవాడ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఐదు రోజులుగా జరుగుతున్న నున్న పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవం శనివారం ఘనంగా ముగిసింది. చివరి రోజు జరిగిన సిడిబండి మహోత్సవానికి గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. రాత్రి మేళతాళాలతో జరిగిన సిడిబండి ఉత్సవానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు హాజరై ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నరసింహారెడ్డి, టీడీపీ నేతలు గంపా శ్రీనివాస్, మాదు శివరామ్‌ప్రసాద్, యార్కారెడ్డి కోటిరెడ్డి, బొకినాల తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సర్పంచ్ పిల్లా అనిత సూచించారు. వీరవల్లిలోని శ్రీలంక వీరయ్య ఉన్నత పాఠశాల ప్లస్‌టూ ఇంటర్ విద్యార్థులకు శనివారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర (ఎస్సార్‌కెవీఎం) కిట్లను పంపిణీ చేశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ ఇంచార్జ్ అరుణకుమారి, హెచ్‌ఎం నిర్మల, రాము, రమణగోపాల్, సునీల్‌కుమార్, కోటేశ్వరరావు, గోవర్ధన్ చంద్రకళ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దార్థ న్యాయ కళాశాలలో మాట్లాడుతున్న న్యాయవాది ప్రశాంత్ భూషణ్

భారత రాజ్యాంగానికి

పునాది ప్రజాస్వామ్యం

పెనమలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : భారత దేశ ప్రజాస్వామ్యం బలోపేతం అవ్వాలంటే ఎన్నికల సంస్కరణలు అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ అభ్యుదయవాది, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఉద్ఘాటించారు. కానూరు సిద్ధార్థ న్యాయ కళాశాలలో ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, భారత రాజ్యాంగానికి పునాది ప్రజాస్వామ్యమని, కానీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం మనదేశ రాజ్యాంగ లక్ష్యాల సాధనలో వెనుకబడిందన్నారు. ఎన్నికల్లో ఒక అభ్యర్థికి 49శాతం ఓట్లు, మరో అభ్యర్థికి 51శాతం ఓట్లు వస్తే 49శాతం ఓట్లు వచ్చిన అభ్యర్థికి ప్రజాస్వామ్యంలో ఎటువంటి భాగస్వామ్యం లేక పోవడం దురదృష్టకరమన్నారు. భారత ఎన్నికల కమిషనర్‌గా టీఎన్ శేషన్ నుంచి 2014 వరకు ఎన్నికల కమిషన్ పక్షపాత రహితంగా వ్యవహరించిందని చెప్పడంలో ఎటు వంటి సందేహం లేదని, మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల కమిషన్ ఒక రబ్బరు స్టాంపుగా మారిపోయిందని విమర్శించారు.

సాయిబాబాకు పుష్పార్చన

ఉయ్యూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చైత్రపౌర్ణమి పురస్కరించుకుని గండిగుంట షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం లక్ష గులాబీ, మల్లెల అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ బొప్పిడి ఉషారామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు. అన్నే జగదీశ్‌బాబు, జ్యోతి, ధనలక్ష్మి మండవ జయదేవ్, వాసు తదితరులు సేవలందించారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల జయకేతనం

పెనమలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఫలితాల్లో విజయవాడ నారాయణ విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణతను సాధించి ప్రతిభను చాటినట్లు సంస్థ డీజీఎం జాగర్లమూడి రవిశంకర్ శనివారం తెలిపారు. జూనియర్ ఎంపీసీలో ఏ సుహాస్ని చౌదరి 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి స్టేట్ టాప్ ర్యాంకును సాధించగా, జయవర్ధిని 467, మనోజ్‌కుమార్ 467, నీలపాటి శామ్యూల్‌రాజు 467 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఆయన తెలిపారు. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను వెంకట వైష్ణవి 435, సాత్విక 435, జితిన్‌రెడ్డి 435, మణికంఠ 435, శివమణి 435, భవ్యశ్రీ 435 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. సీనియర్ ఎంపీసీలో టీ అమృత తులసి 991, శివసాయి దినేష్ 990, లక్ష్మీ ప్రత్యూష 990 మార్కులు సాధించగా...సీనియర్ బైపీసీలో గీతిక 989, బీ జ్యోతి 989, వీర వెంకట జ్యోత్స్న 989, అన్నం భవ్యశ్రీ 989మార్కులతో విజయదుందుభి మోగించారని రవిశంకర్ తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో 285 మంది విద్యార్థులు 980 మార్కులకు పైన, 745మంది 970 మార్కులకుపైన, సీనియర్ బైపీసీలో 980 మార్కులకు పైగా 15మంది, 970 మార్కులకు పైగా 31మంది, జూనియర్ ఎంపీసీ విభాగంలో 460 మార్కులకుపైగా 508 మంది, 450 మార్కులకుపైగా 1181 మంది, జూనియర్ బైపీసీలో 430 మార్కులకుపైగా 32 మంది, 420 మార్కులకు పైగా 95మంది విద్యార్థులు సాధించి 98శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.



విజయసూచికను చూపిస్తున్న డీజీఎం రవిశంకర్, ప్రిన్సిపాల్స్

ఇంటర్‌లో శ్రీశ్రీనివాసకు ఉత్తమ ఫలితాలు

ఉయ్యూరు : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో డింపుల్ 465 మార్కులు సాధించి టౌన్‌ఫస్ట్‌గా నిలిచింది. బైపీసీలో సీహెచ్ మహాలక్ష్మి 433 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సర ఎంపీసీలో జి. రవికిరణ్ 988, పరుచూరి లిపి 987 మార్కులు సాధించారు. బైపీసీలో షబానా అజ్మి 983 మార్కులతో టౌన్‌ఫస్ట్‌గా నిలిచింది. విద్యార్థులను శ్రీశ్రీనివాస విద్యా సంస్థల డైరెక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ, కళాశాల ప్రిన్సిపాల్ యాకయ్య, అధ్యాపకులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీనివాస జూనియర్ కళాశాల డైరెక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, అధ్యాపకులు

ఆకునూరు విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కళాశాల ఎంపీసీ విద్యార్థినులు వి. వరలక్ష్మి 954 మార్కులు సాధించి జిల్లా ప్రభుత్వ జూ నియర్ కళాశాలల్లో ద్వితీయ, కె హారిక 953 మార్కులతో తృతీయ స్థానాల్లో నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ, అధ్యాపకులు, గ్రామ సర్పంచ్ గోలి వసంత కుమార్ వరలక్ష్మి, హారికలను అభినందించారు.

చైతన్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

గన్నవరం : ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో స్థానిక చైతన్య విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఎంపీసీలో డి.శ్రీసాయి మన్విత 470కి 465, ఐ.ఇవాంజలి 458, ఎన్.మేరి జ్యోత్స్న 446, డి.గగన్ ఫణికుమార్ 446 మార్కులు, జూనియర్ బైపీసీలో ఎ.హరిణి 440కి 430 మార్కులు, ఎం.జ్యోతి 424, కె.అఖిల 424 మార్కులు సాధించారన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

కేన్సర్ బాధితురాలికి రోటరీ క్లబ్ ఆర్థిక సహాయం

గుడివాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో కేన్సర్ బాధితురాలు డి.నాగపద్మకు వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం రోటరీ భవన్‌లో క్లబ్ కౌన్సిలర్ జి.శ్రీకర్‌బాబు చేతుల మీదగా రూ.31వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఎస్ రాజశేఖర్, జి.కిరణ్‌బాబు, కోశాధికారి ప్రసాద్, పూర్వ అధ్యక్షులు ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, వి.రామకృష్ణ, బి.శంకరరావు, రావి శ్రీహర్షచౌదరి, ఎం.రమణమూర్తి, నాగపద్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఇంటర్ ఫలితాల్లో నిమ్మకూరు
ఏపీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

పామర్రు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో నిమ్మ కూరు ఏపీఆర్‌జేసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ కె.గ్రేస్ సుభాషిణి శనివారం తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో రేష్మ 990 మార్కులు, ఎంపీసీలో వి.మణికంఠ 987 మార్కులు సాధించారని తెలిపారు. రేష్మ విశాఖ జిల్లా గాజువాకకు చెందిన దూడి జగదీష్, భవాని దంపతుల కుమార్తె అని, తల్లిదండ్రులు ఇద్దరూ రోజువారీ కార్మికులని తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 107మంది పరీక్షలకు హాజరుకాగా 103 మంది(96.26 శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వొకేషనల్ కోర్సులో రెండో ఏడాదిలో 30 మందికి 27 మంది(90 శాతం) ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మొదటి ఏడాదిలో 96 మందికి 94 మంది(98 శాతం) ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఒకేషనల్ విభాగం మొదటి ఏడాదిలో 34 మందికి 34 మంది నూరుశాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.




రేష్మ (990), మణికంఠ (987)

మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ కళాశాలలో 87 శాతం ఉత్తీర్ణత

కూచిపూడి: మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ రెండో సంవత్సరం జనరల్ కోర్సులో 92 మందికి 80 మంది ఉత్తీర్ణులై 87 శాతం ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.ఎస్.వి.ప్రసాద్ తెలిపారు. మొదటి సంవత్సరం జనరల్ కోర్సులో 100 మందికి 81 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే వృత్తివిద్యాకోర్సుల విభాగంలో మొదటి సంవత్సరంలో 78 మందికి 75 మంది ఉత్తీర్ణులై 95 శాతం ఫలితాలు సాధించగా, రెండో సంవత్సరంలో 45 మందికి 44 మంది ఉత్తీర్ణులై 98 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు.

మొదటి స్థానం సాధించిన విద్యార్థులు వీరే

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 942 మార్కులతో కాపుదాసి శ్రీలేఖ ప్రథమ స్థానంలో నిలవగా, బైపీసీ గ్రూపులో 973 మార్కులతో కంచర్ల మురళీధర్, సీఈసీ గ్రూపులో 864 మార్కులతో ఎం.సలోమి ప్రథమ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరం జనరల్ గ్రూపులో ఎంపీసీ విద్యార్థి జుజ్జువరపు సింధు 453 మార్కులు, సీఈసీ విద్యార్థిని వి.సుజాత 450 మార్కులు, హెచ్‌ఈసీ గ్రూపులో వీరంకి గాయత్రి 432 మార్కులు సాధించారు. వృత్తివిద్యా కోర్సుల్లో ఏ అండ్ టీ మొదటి సంవత్సరంలో జోగి కుసుమాంజలి 479, రెండవ సంవత్సరంలో మెరుగుమాల మేఘన 972 మార్కులు సాధించారు.




కె.శ్రీలేఖ (942), ఎం.సలోమి (864)

కంచర్ల మురళీధర్‌కు జిల్లాలో రెండో స్థానం

ప్రభుత్వ కళాశాలల్లో మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థి కంచర్ల మురళీధర్ 1000 మార్కులకు గానూ 973 మార్కులు సాధించి జిల్లాలో రెండో స్థానం సాధించాడని ఆర్‌ఐవో సాల్మన్ రాజు తెలిపారు. మొవ్వ క్షేత్రయ్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మురళీధర్‌కు అభినందనలు తెలిపారు.



మురళీధర్ (973)

సమాజ సేవకులకు అవార్డు అభినందనీయం

గుడివాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సమాజసేవకులు పెనుమోతు వంశీకృష్ణ, తటా చలపతిరావు, కొడాలి ప్రసన్నకుమార్‌కు అబ్దుల్ కలాం అవార్డులు రావడం అభినందనీయమని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ, బీజేపీ నందివాడ మండల అధ్యక్షుడు వాసుపల్లి రాంప్రసాద్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ కాలనీలో పార్టీ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలను వారు ఘనంగా సత్కరించారు.

సమ్మర్ క్యాంపు సద్వినియోగం చేసుకోండి

గుడివాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాన్ని 15 ఏళ్లలోపు బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్టేడియం కమిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, కబడ్డీ, కరాటే, ఖో-ఖో, షటిల్, స్కేటింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, యోగాలో శిక్షణ అందిస్తున్నామన్నారు. బాలికలకు శాస్త్రీయ నృత్యం, బాలురకు వెస్ట్రన్ డ్యాన్స్‌లో వేర్వేరుగా శిక్షణ అందిస్తున్నామన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. శిబిరంలో పాల్గొనే వారికి డైట్ అందిస్తామన్నారు. ఒక్కొక్క క్రీడాకారుడు ఒక్క ఆటకు మాత్రమే అర్హుడని, ఆసక్తిగల బాలబాలికలు స్టేడియం కార్యాలయంలో దరఖాస్తు ఫారాన్ని తీసుకుని తల్లిదండ్రుల సంతకాలు చేయించి ఈనెల 27వ తేదీ లోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.



విరాళం అందజేస్తున్న దాతలు

విఘ్నేశ్వరస్వామి ఆలయ ముఖమండపం నిర్మాణానికి రూ.10,116 వితరణ

గుడివాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ముఖమండపం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన పూర శ్రీధర్, వల్లి దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు. శనివారం దేవస్థానంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, కార్యనిర్వహణాధికారి వైశ్రీనివాసరావు(వాసు)కు నగదును అందజేశారు. ధర్మకర్త లోయ వాసు పాల్గొన్నారు.

16న శ్రీలక్ష్మీ గణపతి హోమం

విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి వైశ్రీనివాసరావు(వాసు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే దంపతులు దేవస్థాన కార్యాలయంలో రూ.516 చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

కూచిపూడి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా శనివారం బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకుడు పెనుమూడి సతీష్ శర్మ అభిషేకాలు జరిపించారు.



ఉత్సాహంగా క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు

● స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ టోర్నమెంట్‌గా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన తిరుపతమ్మ

గుడివాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఫిట్‌జోన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ రాష్ట్ర క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం రెండో రోజుకు చేరాయి. మహిళల అంశంలో విభాగాల్లో పోటీలు జరిగాయి.

మహిళల బెంచ్ ప్రెస్ విభాగంలో..

● సబ్ జూనియర్ మహిళల విభాగంలో 47కేజీల శరీర బరువు విభాగంలో ఎం.హేమశ్రీ(కృష్ణా) ప్రథమ, బి.సింధు(కోనసీమ) ద్వితీయ స్థానం, 57 కేజీల విభాగంలో పి.హిమసంజన(ఎన్టీఆర్) ప్రథమ, డి.తేజస్వినీలత(వైఎస్సార్) ద్వితీయ స్థానం, 63 కేజీల విభాగంలో డి.సాయి హర్షిత(వైఎస్సార్) ప్రథమ, షేక్ మోబీనా(గుంటూరు) ద్వితీయ, 69కేజీల విభాగంలో పి.అంజలి(గుంటూరు) ప్రథ మ, 76కేజీల విభాగంలో బి.లిఖిత(గుంటూరు) ప్రథమ, 84కేజీల విభాగంలో ఇ.లక్ష్మీవినయశ్రీ (గుంటూరు) ప్రథమ స్థానం సాధించారు.

● జూనియర్ మహిళల 43కేజీల విభాగంలో ఎ.పల్లవి(నంద్యాల) ప్రథమ, పి.శ్రావణి(గుంటూరు) ద్వితీయ, 47 కేజీల విభాగంలో ఎం.షనూన్(గుంటూరు) ప్రథమ, బి.సువర్ణ(వైఎస్ఆర్) ద్వితీయ, ఎన్.నాగవీర అను(కృష్ణా) తృతీయ స్థానం, 52కేజీల విభాగంలో జి.వెంకటలక్ష్మీ సరోజ(వైఎస్ఆర్) ప్రథమ స్థానం, 63కేజీల విభాగంలో ఎం.తిరుపతమ్మ(ఎన్‌టీఆర్) ప్రథమ, 69కేజీల విభాగంలో వి.నాగ ప్రగతి(విశాఖపట్నం) ప్రథమ, 76కేజీల విభాగంలో సి.హెచ్ షణ్ముఖప్రియ(తూర్పుగోదావరి) ప్రథమ, 84కేజీల విభాగంలో కె.ప్రవల్లిక(అనకాపల్లి) ప్రథమస్థానం, 84కేజీల పైబడి శరీర బరువు విభాగంలో ఎం.శ్రియ(కోనసీమ) ప్రథమ, ఎస్.రేణుక కళ్యాణి(విజయనగరం) ద్వితీయ, వి.కళ్యాణి శ్రీ(కృష్ణా) తృతీయ స్థానాలు సాధించారు.

● సీనియర్ మహిళల 47కేజీల విభాగంలో ఎం.హేమశ్రీ(కృష్ణా) ప్రథమ, 57కేజీల విభాగంలో బి.సరోజ(విశాఖపట్నం) ప్రథమ, 63 కేజీల విభాగంలో సింధూష(విశాఖపట్నం) ప్రథమ, 69కేజీల విభాగంలో జరా సిద్ధిఖీ(విజయనగరం)ప్రథమ, 76కేజీల శరీర బరువు విభాగంలో కాంతకుమారి(గుంటూరు) ప్రథమ, అనూష(విశాఖపట్నం) ద్వితీయ, 84కేజీల పైన విభాగంలో బి.చంద్రిక(గుంటూరు) ప్రథమ, గాయత్రిదేవి(తిరుపతి) ద్వితీయ స్థానాలు సాధించారు.

● మాస్టర్ మహిళల 76కేజీల విభాగంలో ఎం.కాంతకుమారి(గుంటూరు) ప్రథమ స్థానం, 69కేజీల విభాగంలో జ్యోతి వర్మ(గుంటూరు) ప్రథమ స్థానాలు సాధించారు.




విజేతలతో తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ.. స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ది టోర్నమెంట్ ఎం.తిరుపతమ్మ

మహిళల పవర్ లిఫ్టింగ్ విభాగంలో..

● సబ్ జూనియర్స్ 47 కేజీల విభాగంలో ఎం.హేమశ్రీ(కృష్ణా), బి.సింధు(కోనసీమ) ప్రథమ, ద్వితీయ, 57కేజీల విభాగంలో పి.హిమసంజన(ఎన్టీఆర్), ఎం.ఐశ్వర్య(ప్రకాశం), డి.తేజస్వీని లలిత(వైఎస్సార్) ప్రథమ, ద్వితీయ, తృతీయ, 63కేజీల విభాగంలో డి.సాయిహర్షిత(వైఎస్సార్), ఎస్.ప్రహర్షిణి(ఎన్టీఆర్), వి.దివ్య(ప్రకాశం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, 69కేజీల విభాగంలో పి.అంజలి(గుంటూరు), కె.గోపిక(కృష్ణా), పి.అనంతసత్యదుర్గ(కృష్ణా)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, 76 కేజీల విభాగంలో ఎ.మాధురి(విశాఖపట్నం), బి.లిఖిత(గుంటూరు), బి.రమ్య(ప్రకాశం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, 84కేజీల విభాగంలో ఇ.లక్ష్మీవినయశ్రీ(గుంటూరు), ఎం.కీర్తి(ఎన్టీఆర్)లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

● జూనియర్స్ అంశంలో 43కేజీల విభాగంలో ఎ.పల్లవి(నంద్యాల), పిశ్రావణి(గుంటూరు), బి.శివాని(విజయనగరం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, 47కేజీల విభాగంలో ఎం.షనూన్(గుంటూరు), బి.సువర్ణ(వైఎస్సార్), ఎన్.వీననాగ అను(కృష్ణా)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, 52కేజీల విభాగంలో ఎం.కావ్య(ప్రకాశం), వి.నిహారిక(విజయనగరం), పి.గాయత్రిరెడ్డి(విజయనగరం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, 57కేజీల విభాగంలో కె.సువర్ణకుమారి(ఎన్టీఆర్), వి.హేమ అంజలి(గుంటూరు)లు ప్రథమ, ద్వితీయ, 63కేజీల విభాగంలో ఎం.తిరుపతమ్మ(ఎన్టీఆర్) ప్రథమ, 69కేజీల విభాగంలో వి.నాగప్రగతి(విశాఖపట్నం), ఎల్.చాతుర్య(గుంటూరు), ఐ.సాహితీ(కృష్ణా) ప్రథమ, ద్వితీయ, తృతీయ, 76కేజీల విభాగంలో జి.నాగసాయి గీతిక(ఎన్టీఆర్), పి.దీపిక(విజయనగరం), సీహెచ్ షణ్ముఖప్రియ(తూర్పుగోదావరి) ప్రథమ, ద్వితీయ, తృతీయ, 84 కేజీల విభాగంలో వి.ప్రవల్లిక(అనకాపల్లి), కె.శశికళ(ఎన్టీఆర్), సీహెచ్ తులసీదుర్గ(పశ్చిమగోదావరి) ప్రథమ, ద్వితీయ, తృతీయ, 84కేజీల పైబడి విభాగంలో ఎన్.జ్ఞానదివ్య (గుంటూరు), ఎం.శ్రియ (కోనసీమ), ఎస్.రేణుక కల్యాణి (విజయనగరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

● సీనియర్ మహిళల 47కేజీల విభాగంలో షేక్ షనూన్(గుంటూరు), పి.పల్లవి(నంద్యాల), ఎం.హేమశ్రీ(కృష్ణా)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, 52కేజీల విభాగంలో పి.జ్యోతి(కృష్ణా) ప్రథమ, 57కేజీల విభాగంలో బి.సరోజ(విశాఖపట్నం), కె.సువర్ణకుమారి(ఎన్టీఆర్), వి.శశికళ(విశాఖపట్నం) ప్రథమ, ద్వితీయ, తృతీయ, 63కేజీల విభాగంలో ఎం.తిరుపతమ్మ(ఎన్టీఆర్), జి.ఎన్.వి.ఎస్ సింధూష(విశాఖపట్నం), ఆర్.ధన(విశాఖపట్నం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ, 69 కేజీల విభాగంలో ఎస్.జర సిద్ధిఖీ(విజయనగరం), వి.నాగప్రగతి(విశాఖపట్నం), ఆర్.జ్యోతివర్మ(గుంటూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

మహిళల విభాగంలో పలు విభాగాల్లో పతకాలు సాధించిన ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎం.తిరుపతమ్మ స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికయ్యారు. విజేతలకు బహుమతులను తూర్పుకృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి) అందించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి మహ్మమద్ సైదా పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న శరత్‌బాబు

ఆదర్శనీయుడు అంబేడ్కర్

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని మేధా సంపత్తిని పెంచుకోవాలని గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ అధ్యాపకులు కొడాలి శరత్ బాబు, ఎం.శివప్రసాద్ అన్నారు. శనివారం గుడ్లవల్లేరులోని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో రెండు రోజులు ముందే నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల డైరెక్టర్ నారాయణం శ్రీనివాస మూర్తి, ప్రిన్సిపాల్ లీనా సాతులూరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సెక్రటరీగా నామా

పెదపారుపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర సెక్రటరీగా దూళ్లవానిగూడెం గ్రామానికి చెందిన నామా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆ పార్టీ అధిష్ఠానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తనకు బాధ్యత అప్పగించిన అధినేత జగన్మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటకోడూరు గ్రామంతో చేపల చెరువు వద్ద ఓ కార్మికుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన తమిళసీనూ నాలుగు నెలలుగా గుంట కోడూరు గ్రామంలో నరేష్ అనే వ్యక్తి చేపల చెరువు వద్ద కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం చేపల చెరువుల వద్ద మరమ్మత్తు చేసిన మోటారును మారుస్తుండగా, అనుకోకుండా విద్యుత్ షాక్ తగలటం వల్ల కింద పడిపోయాడు. వెంటనే అతడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెంది నట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

అసభ్య కార్యకలాపాలపై దాడి

గుడివాడ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో అసభ్య కార్యాకలాపాలు నడుస్తున్నాయన్న సమాచారంతో ఎస్సై ఎన్.చంటిబాబు శనివారం సిబ్బందితో కలిసి దాడి చేసి, నలుగురిని అరెస్టు చేశారు. నిందితురాలు (38) మరో వ్యక్తితో కలిసి మల్లాయిపాలెంలోని టిడ్కో ఇంటిని అద్దెకు తీసుకుని అసభ్య కార్యాకలాపాలకు కేంద్రంగా మార్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరు విటులను అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన యువతితో విటులకు వల వేయిస్తున్నట్టు తెలిపారు. దాడిలో రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైక్, రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

పసరుగా తాగునీరు.. గ్రామస్థుల ఆందోళన

పెదపారుపూడి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మోపర్రు గ్రామంలో మంచినీటి చెరువులో నీరు కుళాయిల ద్వారా పసరుగా వస్తోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నీరు వాసన రావడంతో పశువులు కూడా తాగటం లేదని అంటున్నారు. ఫిల్టర్ బెడ్ పని చేయకపోవడమే కారణమని చెబు తున్నారు. చెరువులోని నీరు పసరుగా వస్తోందని, దుర్వాసన వేస్తోందని, నీటితో స్నానం చేస్తే దురదలు, బొబ్బలు, పొక్కులు వస్తున్నాయని నీటి సంఘ మాజీ అధ్యక్షుడు బోయిన సాంబశివరావు తెలిపారు. ఫిల్టర్ బెడ్ పని చేయటం లేదని అధికారులను అడిగితే 15 రోజుల్లో బాగు చేస్తామని అంటున్నారని తెలిపారు. అధికారులు, నాయకులు స్పందించి గ్రామంలో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని కోరుతున్నామన్నారు. కోటి లత, మరియమ్మ, సుగుణ మేరీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



కుళాయి నుంచి నీరు పసరుగా వస్తోందని చూపుతున్న మోపర్రు గ్రామస్థులు



నిరసన కార్యక్రమంలో భవన నిర్మాణ రంగ కార్మికులు

సంక్షేమ బోర్డును కొనసాగించాలి

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును రద్దు చేయకుండా, కొనసాగించాలని గుడివాడ నియోజకవర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గుడ్లవల్లేరులో వారు నిరసనకు దిగారు. ఈనెల 24వ తేదీన మచిలీపట్నంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం గుడివాడ పట్టణ ఉపాధ్యక్షుడు బండి శ్రీను, గుడ్లవల్లేరు భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నాయకుడు వెంకటరావు, భవన నిర్మాణ కార్మికులు, కాంక్రీట్ కార్మికులు పాల్గొన్నారు.

దూరంగా ఉన్న బడికి మా పిల్లల్ని పంపం..

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తమ పిల్లలను దూరంగా ఉన్న బడికి మార్చొద్దని, దళితవాడ పాఠశాలలోనే చదవనివ్వాలంటూ కౌతవరం పెద దళితవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, వారి తల్లితండ్రులు శనివారం పాఠశాల ఎదుట నిరసనకు దిగారు. ఈ పాఠశాల నుంచి మూడు, నాలుగు, ఐదు తరగతులను వేరే పాఠశాలలో కలుపుతున్నారని తెలిసిందని, అలా చేయొద్దని వారు డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు కోటప్రోలు నాగు, ఈడే శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు నాయక్, రుక్మిణి పాల్గొన్నారు.



కౌతవరం పెద దళితవాడ పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుడివాడ తాలూకా యూనిట్ కార్యవర్గం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ పరిధిలోని గుడివాడ తాలూకా యూనిట్ ఎన్నికలు శనివారం వెలమ సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారి తోట వరప్రసాద్, సహాయ ఎన్నికల అధికారి ఎస్ఏఎస్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా కె.దుర్గేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆర్.జోజి, జనరల్ సెక్రటరీగా బి.రాజేష్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ఎంసీహెచ్ శ్రీనివాసన్, ట్రెజరర్ జి.రామారావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.భానుప్రకాష్, వి.క్రాంతికుమార్, డీఎస్ శిరీష, కె.దేవకీదేవి, డి.కుమార్, జాయింట్ సెక్రటరీ బి.రాధాకృష్ణ, కె.ముక్తేశ్వరరావు, డి.జగదీష్, టీడీవీ ప్రసాద్, జి.రాజు, పి.రేఖ ఎన్నికయ్యారు.



బాలికల వసతి గృహ నిర్మాణాల పరిశీలన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): త్వరితగతిన బాలికల వసతి గృహాలు పూర్తి చేయాలని, రానున్న విద్యా సంవత్సరంలోకి అందుబాటులోకి తీసుకువచ్చేలా పనిచేయాలని అధికారులకు కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ సూచించారు. శనివారం యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.14 కోట్ల 62 లక్షలతో నిర్మిస్తున్న జీ ప్లస్-1 భవన నిర్మాణాన్ని ఆయ న పరిశీలించారు. 300 మంది బాలికలకు వసతి కల్పించేలా ఈ భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

బోట్లను సముద్రం ఒడ్డున నిలుపుదల చేయండి

● జాలరులకు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సునీత ఆదేశం

నాగాయలంక, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10 లాండింగ్ సెంటర్ల పరిధిలో 950 మోటారు బోట్లు ఉన్నాయని, జాలరులు తమ బోట్లను ఒడ్డుకు తీసుకొచ్చి నిలుపుదల చేయాలని అవనిగడ్డ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.సునీత ఆదేశించారు. నాగాయలంక సముద్రంలో యాంత్రిక పడవల ద్వారా జాలరుల చేపల వేటలపై ఈనెల 15 నుంచి జూన్ 14వరకు ప్రభుత్వం నిషేధం విధించిందని ఆమె తెలిపారు. ఈ 61 రోజుల కాలంలో సముద్రంలో చేపలు, రొయ్యలు పునరుత్పత్తి చేస్తాయని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించి వేట చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.



ప్రత్యేక వాహనంపై ఊరేగుతున్న లంకమ్మ, ఘటం బిందెలతో ఆలయానికి వస్తున్న చిన్నారులు

వైభవంగా లంకమ్మ జాతర

అవనిగడ్డ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర కన్నుల పండువగా జరిగింది. వారం రోజులుగా అమ్మవారు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పసుపు, కుంకుమ, చీర సారెలు అందుకుని శనివారం ఉదయం ఆలయానికి చేరుకోవటంతో జాతర ప్రారంభమైంది. మొక్కులు తీర్చుకునేవారు ఘటం బిందెలతో ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి ఘటం బిందెలను సమర్పించారు. డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో 7 వేల మందికి అన్నదాన వితరణ చేశారు. ఆలయ ఈవో వైశ్రీనివాసరావు (వాసు) పర్యవేక్షించారు.

లంకమ్మను దర్శించుకున్న ప్రముఖులు

లంకమ్మను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కుమారుడు మండలి వెంకట్రామ్, కూటమి నేతలు దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, లంకమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ బాలభాస్కరావుతో కలిసి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్, ఆయన సోదరులు లంకమ్మను దర్శించుకున్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



మారెమ్మను దర్శించుకుంటున్న మండలి వెంకట్రామ్

చల్లపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం శివారు చింతలమడలో గ్రామదేవత మారెమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. జాతరలో రెండో రోజైన శనివారం గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గుడివాక శివరావు, సూదాని నందగోపాల్, సూదాని సత్యనారాయణ, శీరం మురళీకృష్ణ, సూదాని దుర్గ, సూర్యప్రకాష్, చీడేపూడి చరణ్, సూదాని నాంచారయ్య, శీరం ఉపేంద్ర, సూదాని సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా అద్దంకి నాంచారమ్మ నెల జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోడూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): విశ్వనాథపల్లి గ్రామంలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి నెల జాతర వైభవంగా జరిగింది. శనివారం విశేషాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జాము నుంచే భక్తులు తమ పశువులను, వాహనాలను ఆలయం చుట్టూ తి ప్పి, పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆలయ ఈవో జయశ్రీ జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గుర్రపు డెక్క తొలగింపు



గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించాక కాలిబాట వంతెన వద్ద ప్రవహిస్తున్న నీరు

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ శివారు కాలిబాట వంతెన వద్ద పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్కను ఇరిగేషన్ సిబ్బంది తొలగిస్తున్నారు. తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోయాయని శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావటంతో ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు స్పందించారు. ఆయన ఆధ్వర్యంలో లస్కర్లు గుర్రపుడెక్క తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం కూడా ఈ పని నిర్వహించి పూర్తిస్థాయిలో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందేలా చూస్తామని డీఈ తెలిపారు. కాలిబాట వంతెన వద్ద తొలగింపు కార్యక్రమాన్ని 70 శాతం వరకు పూర్తి చేశారు.

బాలికల వసతి గృహ నిర్మాణాల పరిశీలన



కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్మిస్తున్న బాలికల హాస్టల్ భవనాల నిర్మాణాలను పరిశీలిస్తున్న వీసీ కూన రాంజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): త్వరితగతిన బాలికల వసతి గృహాలు పూర్తి చేయాలని, రానున్న విద్యా సంవత్సరంలోకి అందుబాటులోకి తీసుకువచ్చేలా పనిచేయాలని అధికారులకు కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ సూచించారు. శనివారం యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.14 కోట్ల 62 లక్షలతో నిర్మిస్తున్న జీ ప్లస్-1 భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. 300 మంది బాలికలకు వసతి కల్పించేలా ఈ భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు.

జలియన్‌వాలాబాగ్ అమరవీరులకు ఘన నివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య పోరాటం జరిగినప్పుడు పంజాబ్ జలియన్‌వాలాబాగ్ దుర్ఘటనలో మృతిచెందిన అమరవీరులకు శనివారం అజ్మీర్‌బాబా దర్గా సేవా సమాజం ప్రతినిధులు ఘన నివాళులర్పించారు. వైస్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ పీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ బాజీ, షేరాలి, నితిన్, ఫారూఖ్, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం

● మంత్రి కొల్లు రవీంద్ర హామీ



తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తామని ప్రజలకు మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. శనివారం తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ఆయన సందర్శించారు. నీటి మట్టం, తరకటూరు, బందరు పంపుల చెరువుల్లోని నీటి నిల్వలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర రక్షిత మంచినీటి సరఫరాను పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలని మునిసిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీ నుంచి మచిలీపట్నం నగరం, బందరు మండలం, పెడన, గూడూరు మండలాలకు తాగునీరు అందిస్తామన్నారు. తరకటూరు చెరువులను 450 సామర్థ్యం కల మోటార్లతో నీటిని తోడుతూ నింపే కార్యక్రమం చేపట్టామన్నారు. వారంలో నీటిని నింపే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. తరకటూరు సమ్మర్ స్టోరేజి సామర్థ్యం 5.1 మీటర్లు కాగా ప్రస్తుతం 4.5 మీటర్లు ఉందన్నారు. గత వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే 70 హెచ్‌పీ మోటార్లకు అదనంగా మరో 460 హెచ్‌పీ మోటార్లకు ట్రాన్స్‌ఫార్మర్, ఇంజన్లను ఏర్పాటు చేశామన్నారు. మచిలీపట్నం పంపుల చెరువులో 13 అడుగుల సామర్థ్యానికి, ప్రస్తుతం 8 అడుగుల వరకు నీరు ఉందన్నారు. నీటిని నిల్వ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న 70 రోజులకు మంచినీటికి ఎలాంటి కొరత లేదన్నారు. తరకటూరు నుంచి మచిలీపట్నం వరకు పైపులైన్లు లీకు కాకుండా జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి చర్యలు చేపడుతున్నామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచినీటి కొరత లేకుండా ఉండాలనే ఉద్దేశంతో రూ.2కోట్ల 40 లక్షలతో ఫిల్టర్‌బెడ్లకు నిధులు మంజూరు చేశామన్నారు. టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. కృష్ణానది నుంచి వాటర్ గ్రిడ్ ద్వారా బందరుకు పైపులైన్లు వేయించి ఇంటింటికీ కుళాయి వేయించి మంచినీరు సరఫరా చేస్తామని, దీనిపై సీఎంతో మాట్లాడామని తెలిపారు. మంత్రి వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ డీఈ రామప్రసాద్, ఏఈ రాజేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, జలవనరుల శాఖ ఏఈ హరీష్ ఉన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

బందరు మండలం సుల్తానగరంలో శనివారం ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామిని మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. స్వామికి నిర్వహిస్తున్న ప్రత్యేక అర్చనల్లో పాల్గొన్నారు. మంత్రితో సుల్తానగరం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంచార అంబలి పంపిణీ కేంద్రం ప్రారంభం

కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కోనేరుసెంటర్‌లో సంచార అంబలి పంపిణీ కేంద్రాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చడానికి అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కొల్లు ఫౌండేషన్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు.

కౌలు రైతు చట్టంలో మార్పు చేయాలి



మాట్లాడుతున్న కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు

చల్లపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నూతన కౌలురైతు చట్టంలో మార్పు చేయాలని ఏపీ కౌలురైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల కౌలు రైతుసంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రంగారావు పాల్గొన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, రైతుభరోసా కల్పించాలన్నారు. మినుము, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఉపాధి పథకం కూలీలకు 200 రోజులు పని కల్పించాలనీ, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు పనిప్రాంతంలో తాగునీరు, షామియానా, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా సమస్యలపై సమావేశంలో తీర్మానించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు, కౌలురైతు సంఘం సహాయ కార్యదర్శి ఎం.సురేష్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు యద్దనపూడి మధు, నేతలు వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు బంగారు బందరుపై సమావేశం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బంగారు బందరు రూపకల్పనపై జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు మంత్రి కొల్లు రవీంద్ర శనివారం తెలిపారు. మచిలీపట్నంలోని మేధావులు, సీనియర్ సిటిజన్లు బందరు అభివృద్ధిని కోరే పెద్దలు ఈ సమావేశంలో పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.



విజేతలతో ఏఆర్కే మూర్తి, పీవీ ఫణికుమార్ తదితరులు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకుని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో శనివారం మహాభారతం, రామాయణంలోని వివిధ ఘట్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఏఆర్కే మూర్తి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు వింజమూరి శివరాం, పి.వి.ఫణికుమార్, మోపర్తి సుబ్రహ్మణ్యం, జీఎస్ఆర్ శర్మ, సీహెచ్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యతో ఉపాధి అవకాశాలు

గూడూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ విద్య ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని మల్లవోలు హెచ్‌ఎం కె.అరుణ తెలిపారు. మల్లవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో 29 మంది విద్యార్థులకు ఎంపీ రియల్ విభాగంలో హ్యాండ్లూమ్, ఎంబ్రాయిడరీంగ్ వృత్తి విద్యపై బాల చౌడేశ్వరీ చేనేత సొసైటీ శిక్షణ కేంద్రంలో శనివారం శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం సూచించారు. కోర్స్ కో ఆర్డినేటర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్, వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం



భూమిపూజలో పాల్గొన్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

పెడన, మే 12 (ఆంధ్రజ్యోతి): గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో స్ట్రాంగ్ రూమ్, వాటర్ ట్యాంకుల నిర్మాణానికి కలిదిండికి చెందిన దాత లక్ష్మీపురపు అజయ్‌బాబు రూ.15 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడూరు అగస్త్యయ్య, అర్చకుడు గూడూరు శివదత్తలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.కృష్ణారావు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కరగ్రహారం మాజీ సర్పంచ్ నాగుల్‌మీరా స్వామి అన్నారు. శనివారం క్యాంపుబెల్‌పేటలోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో నాగుల్‌మీరా మాట్లాడారు. యూపీ పాఠశాలను ఉన్నత పాఠశాల చేసేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు తమ విద్యార్థులను పంపితే ఉన్నత పాఠశాలగా మారుతుందని ఆయన సూచించారు.

మాకినేని బసవపున్నయ్యకు ఘన నివాళి

చల్లపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సీపీఎం తొలి పొలిట్‌బ్యూరో సభ్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య 33వ వర్ధంతిని గుంటూరు బాపనయ్య భవన్‌లో శనివారం నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం కోసం, పేద ప్రజల కోసం చివరి వరకూ పోరాడిన నేత బసవపున్నయ్య అని నేతలు కొనియాడారు. మాకినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేతలు పంచకర్ల రంగారావు, శీలం నారాయణరావు, యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం

నాగాయలంక, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నాగాయలంకలోని 1వ వార్డులో వృద్ధాశ్రమంలో ఉంటున్న దేవరకొండ రేణుకమ్మ(89) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో చనిపోయారు. మృతురాలి మేనల్లుడు మాదివాడ నాగరాజు ఆమె కళ్లను నేత్రదానం చేశారు. శనివారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నుంచి డాక్టర్ సాయి, సిబ్బంది వచ్చి నేత్రాల నుంచి కార్నియా సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇది 231వ నేత్రదామని నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన ఉత్తీర్ణతా శాతం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న హాస్టళ్లలో ఉత్తీర్ణతా శాతం పెరిగిందని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి షేక్ షాహీద్‌బాబు తెలిపారు. సెకండియర్ విద్యార్థులు 79 మందికి 73 మంది, ఫస్టియర్ విద్యార్థులు 143 మందికి 104 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామని, 92.4 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు.

లేడీయాంప్తిల్ విద్యార్థుల ప్రతిభ



గాయత్రి, ఒకేషనల్ (988)



బాలా త్రిపురసుందరి, ఎంపీసీ (980)

ఇంటర్ ఫలితాల్లో లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో ఏడాది వృత్తి విద్యా కోర్సులో విద్యార్థి మట్టా గాయత్రి 1000కి 988 మార్కులు, ఎంపీసీలో ఎ.బాలాత్రిపుర సుందరి 980 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 75.3 శాతం, రెండో సంవత్సరంలో 91.5శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సుందరలక్ష్మి తెలిపారు.

బైపీసీలో మేఘనా సంధ్యకు 954 మార్కులు



మేఘనా సంధ్య, బైపీసీ (954)

అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ విభాగంలో కె.మేఘనా సంధ్య 954 మార్కులు సాధించి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. జడ్పీ ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌లో 8 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 79 మందికి 66 మంది ఉత్తీర్ణతను సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.వి.నరసింహారావు, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో హెచ్‌ఎం సింహాద్రి రవీంద్రబాబు అభినందించారు.

బొడ్డు నాగయ్య కళాశాలలో 80 శాతం ఉత్తీర్ణత



తాడంకి మైథిలి, ఎంఈసీ(944)

పెడన: ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల జిల్లాలో 4వ స్థానంలో నిలిచింది. ఈ కళాశాల నుంచి ఇంటర్ తొలి ఏడాది పరీక్షలకు 75 మంది హాజరు కాగా 57 మంది, సెకండ్ ఇంటర్ 42 మందికి 34 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్ట్ ఇంటర్ ఓఏఎస్ గ్రూపులో పేరం మహాలక్ష్మి 500 మార్కులకు 478 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. సీఈసీలో ఎన్.వి.ప్రవల్లిక 500 మార్కులకు 470 సాధించింది. సెకండర్ ఇంటర్‌లో షేక్ మొబినా 1000 మార్కులకు 938, మండల పరిధిలోని బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫస్ట్ ఇంటర్ పరీక్షలకు 45 మంది హాజరు కాగా 37 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇంటర్‌లో 43 మంది హాజరు కాగా 38 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇంటర్ ఎంఈసీ గ్రూపులో మైథిలి 1000కి 944, గోశాల సిరి 1000కి 847 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. చెన్నూరు హైస్కూల్ ప్లస్‌లో ఫస్ట్ ఇంటర్‌కు 9 మంది హాజరు కాగా ఎవరూ ఉత్తీర్ణులవలేదు. సెకండ్ ఇంటర్ పరీక్షలకు ఐదుగురికి ఒక్కరే ఉత్తీర్ణులయ్యారు. బల్లిపర్రు గురుకుల పాఠశాలలో ఎంఈసీ గ్రూపులో తాడంకి మైథిలి 1000కి 944 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచింది.

98.6 శాతం ఉత్తీర్ణత

మోపిదేవి: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మోపిదేవి బీసీ గురుకుల కళాశాల 98.6 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 47 మంది విద్యార్థులు హాజరు కాగా 46 మంది, బైపీసీలో 12 మందికి 11, సీఈసీ 14 మందికి 13 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో ఎంపీసీ 42 మందికి 42, బైపీసీలో 10 మందికి 10, సీఈసీ 15 మంది విద్యార్థులు హాజరు కాగా, 14 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పదహారుమందికి 8 మంది ఉత్తీర్ణత

నాగాయలంక: నాగాయలంక జడ్పీ పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మొదటి సంవత్సరంలో 8 మందికి ఇద్దరు, రెండో సంవత్సరంలో 8 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం పదహారు మందికి ఎనిమిది మంది ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ గ్రూపులో విశ్వనాథపల్లి పవిత్ర (905) అత్యధిక మార్కులు సాధించింది. తలగడదీవిలో మొదటి సంవత్సరం పరీక్షలకు ఇద్దరు హాజరు కాగా, ఎవ్వరూ ఉత్తీర్ణత సాధించలేదు.